సాక్షి
మంచిర్యాల
శుక్రవారం । 11 । ఏప్రిల్ । 2025



నిరాశపర్చిన మామిడి

వాతావరణ మార్పుతో మామిడి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈసారి పూత, కాత సరిగా రాలేదు. కాసిన చోట తెగుళ్లు ఆశించి కాయలు రాలిపోతున్నాయి. 8లో▸



ఫాంహౌస్ స్థలం పరిశీలన

'ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం' శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. తహసీల్దార్ సతీష్ సర్వేయర్‌తో కలిసి భూములు పరిశీలించారు. 8లో▸

గరిష్టం/కనిష్టం
38.0 /26.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. వడగాలులు బలంగా వీస్తాయి. ఎండల తీవ్రత పెరుగుతుంది. ఉక్కపోతగా ఉంటుంది.

ఆలస్యం.. ఆస్తి నష్టం..!



గత జనవరి 27న చెన్నూర్‌లోని పత్తి మిల్లులో జరిగిన అగ్ని ప్రమాదంలో కాలిపోయిన పత్తి

- చిన్న చిన్న తప్పిదాలతోనే అగ్ని ప్రమాదాలు
- అప్రమత్తతతోనే నివారణ
- ఈ నెల 14 నుంచి అగ్నిమాపక వారోత్సవాలు

మంచిర్యాలక్రైం: చిన్న చిన్న తప్పిదాలతోనే అగ్ని ప్రమాదం చోటు చేసుకుంటుంది. జిల్లాలో కొన్ని గ్రామాలు ఫైర్‌స్టేషన్లకు దూరంగా ఉండడంతో అగ్నిమాపక సిబ్బందికి అక్కడికి చేరుకునేలోనే నష్టం పెరిగిపోతోంది. అధికారుల లెక్కల ప్రకారం 4016.46 చదరపు కిలోమీటర్లలో జిల్లా విస్తరించి ఉంది. 18మండలాలు, ఐదు మున్సిపాలిటీలు, ఒక కార్పొరేషన్ ఉండగా.. నాలుగు ఫైర్‌స్టేషన్లు ఉన్నాయి. ఓ వైపు సిబ్బంది కొరత ఉండగా.. దీనికి తోడు జిల్లా కేంద్రంలోని ఫైర్‌స్టేషన్‌లో రెండు ఫైరింజన్లు.. మిగతా స్టేషన్లలో ఒక్కొక్కటే ఉన్నాయి. దీంతో స్టేషన్‌కు దూర ప్రాంతంలో అగ్ని ప్రమాదం జరిగితే ఉన్న ఒక్క ఫైరింజన్ అటు వెళ్తే.. అదే సమయంలో మరోచోట ప్రమాదం జరిగితే ఇక కాలి బూడిద కావాల్సిందే. జిల్లా కేంద్రంలో గత ఏడాది బట్టల దుకాణంలో అగ్ని ప్రమాదం జరుగగా రెండు ఫైరింజన్లు వచ్చినా మంటలు అదుపులోకి రాలేదు. బెల్లంపల్లి నుంచి మరో ఫైరింజన్‌ను పిలిపించి మంటలు అదుపులోకి తెచ్చారు. వేసవిలో అగ్ని ప్రమాదాల అధికంగా చోటు చేసుకునే అవకాశం ఉండడంతో ఈ నెల 14నుంచి 20వరకు అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహించనున్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో..

వేసవి కాలంలో గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా గడ్డివాములు, పత్తి కట్టెలు, పూరిగుడిసెల్లో ఎక్కువగా అగ్ని ప్రమాదాలు సంభవిస్తుంటాయి. వాటిని ఇళ్ల మధ్యనే ఏర్పాటు చేయడం చాలా ప్రమాదకరమన్న విషయాన్ని ఎవరు గుర్తించడం లేదు. ఎండల తీవ్రతతో గడ్డివాములకు నిప్పంటుకునే అవకాశం ఉంది. పల్లెల్లో ఇంటి ఆవరణలోనే కట్టెల పొయ్యిలు వినియోగిస్తుంటారు. దీంతో నిప్పురవ్వలు గడ్డివాములపై పడినా, ఎవరైనా బీడీలు, సిగరెట్లు తాగి ఆర్పకుండా పడేసినా మంటలు అంటుకుంటాయి. అందుకే ఊరికి దూరంలో ఏర్పాటు చేసుకుంటే మంచిది.

పత్తి నిల్వలు పదిలం..

పత్తి కట్టెలు, నిల్వ ఉన్న పత్తికి మంటలు తేలికగా అంటుకునే స్వభావం ఉంటుంది. పత్తి నిల్వలతో చాలా ప్రమాదాలు జరుగుతుంటాయి. జిన్నింగ్ పరిశ్రమల్లో పత్తి కుప్పలు(గంజి) మధ్య రెండు నుంచి మూడు మీటర్ల దూరం ఉంచాలి. ప్రమాదం జరిగినా ఒకే కుప్ప కాలిపోతుంది. దీంతో నష్టం తక్కువ వస్తుంది. కానీ ఈ నిబంధనలు ఎవరు పాటించడం లేదు. గ్రామాల్లో రైతులు పత్తికి ధర లేదని, ధర పెరిగే వరకు ఇళ్ల ఆవరణ, సమీపంలోని కొట్టాల్లో నిల్వ చేస్తుంటారు. ఇది చాలా ప్రమాదకరం. తప్పని పరిస్థితుల్లో చేయాల్సి వస్తే పత్తి నిలవ్వలు ఉన్న ప్రాంతంలో విద్యుత్ సరఫరా లేకుండా చూసుకోవాలి.

జిల్లాలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదాలు

- ఈ ఏడాది జనవరి 27న చెన్నూర్ ఎల్లక్కపేటలోని ఆదిశంకరచార్యా జిన్నింగ్ మిల్లులో అగ్ని ప్రమాదం జరిగింది. సుమారు రూ.60లక్షల విలువైన పత్తి దగ్ధమైంది.
- 2024 జూలై 19న జిల్లా కేంద్రంలోని మహాశివ ఎలక్ట్రికల్ అండ్ సానిటేషన్‌లో షాపులో అగ్ని ప్రమాదం జరిగింది. సుమారు రూ.30లక్షల విలువైన ఆస్తి నష్టం వాటిల్లింది.

షార్ట్ సర్క్యూట్ వల్లే..

పట్టణాల్లో 70శాతం అగ్ని ప్రమాదాలు విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ వల్లే జరుగుతున్నాయి. నాసిరకం విద్యుత్ తీగల వల్ల ఓవర్‌లోడ్ సరఫరా జరిగినప్పుడు షార్ట్‌సర్క్యూట్ ఏర్పడి ప్రమాదాలు సంభవిస్తున్నాయి. తీగలు తెగినప్పుడు కొందరు మధ్యలో అతుకులు వేస్తుంటారు. ఇలా చేయడం వల్ల కూడా ఆ ప్రాంతంలో ఓవర్‌లోడ్ విద్యుత్ సరఫరాతో వేడికి కరిగిపోయి మంటలు చెలరేగే అవకాశం ఉంది. ఏళ్ల తరబడి వాడుతున్న విద్యుత్ తీగల్లో లోటుపాట్లను గుర్తించి తరచుగా మార్చుకోవడం మంచిది. ఇళ్ల నిర్మాణాల్లో అప్పటి పరిస్థితులను బట్టి తక్కువ సామర్థ్యం కలిగిన వైర్లు, స్విచ్‌బోర్డులు వాడుతున్నారు. తర్వాత కాలంలో కూలర్లు, ఫ్రిడ్జ్, వాషింగ్‌మెషిన్, ఏసీలు ఏర్పాటు చేసుకుంటారు. లోడ్ ఎక్కువ కావడం వల్ల వైరింగ్ ఫెయిలై అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది.

నిర్లక్ష్యం వల్లే అగ్ని ప్రమాదాలు



చిన్నపాటి నిర్లక్ష్యం వల్లే అగ్నిప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. అగ్ని ప్రమాదాల నివారణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. భవన నిర్మాణంలో నాణ్యమైన విద్యుత్ వైర్లు, స్విచ్ బోర్డులు వినియోగించాలి. ఆసుపత్రులు, హోటళ్లు, సినిమా థియేటర్లు, కల్యాణ మండపాలు, కళాశాలల్లో అగ్నిమాపక పరికరాలు ఏర్పాటు చేసుకోవాలి. పరికరాల వినియోగంపై అవగాహన కల్పిస్తున్నాం. చిన్నపాటి జాగ్రత్తలు పాటిస్తే అగ్ని ప్రమాదాలు జరగకుండా నివారించవచ్చు.

– భగవాన్‌రెడ్డి, జిల్లా ఫైర్ అధికారి, మంచిర్యాల

జిల్లాలో నాలుగేళ్లలో జరిగిన అగ్ని ప్రమాదాలు

సంవత్సరం	అగ్ని ప్రమాదాలు	ఆస్తి నష్టం
2021-22	124	రూ.88లక్షలు
2022-23	152	రూ.1.10కోట్లు
2023-24	120	రూ.1.1కోట్లు
2024-25	110	రూ.1కోటి

జిల్లాలోని ఫైర్‌స్టేషన్ల ఫోన్ నంబర్లు, వాహనాలు

అగ్నిమాపక కేంద్రం	అధికారి సెల్ నంబర్	ల్యాండ్/మొబైల్ నంబర్	బుల్లెట్ వాహనం	ఫైరింజన్లు	మిస్ట్ జీప్
మంచిర్యాల	87126 99195	08736 252101/8712699194	1	2	1
బెల్లంపల్లి	87126 99199	08735 225101/8712699198	1	1	-
జన్నారం	87126 99197	08739 245101/8712699196	1	1	-
చెన్నూర్	87126 99201	08737 242101/8712699200	-	1	-

అద్దె వాహనం.. సొంత పనులు!

- విద్యుత్ శాఖ అధికారుల తీరు
- డ్రైవరు, ఉన్నతాధికారి మధ్య వివాదం



జిల్లా ఎస్ఈ కార్యాలయం

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు విధి నిర్వహణలో వినియోగించాల్సిన అద్దె వాహనాలను సొంతానికీ వాడుకుంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించేందుకు, విధుల్లో రాకపోకల కోసం ఏడీ, డీఈ, ఎస్ఈ స్థాయి అధికారులకు వాహనాల అనుమతి ఉంది. నెలవారీగా అద్దె చెల్లించే విధంగా ప్రైవేటు వాహనాలను సమకూర్చుతున్నారు. ప్రతీ నాలుగు నెలలకోసారి టెండర్ నిర్వహించి నిబంధనల ప్రకారం వాహనాలు ఎంపిక చేస్తున్నారు. జిల్లాలో ప్రస్తుతం 17వాహనాలు అద్దె ప్రాతిపదికన నడుస్తున్నాయి. కొందరు అధికారులు తమ సొంత వాహనాలే వాడుకుంటూ ఇతర వాహన పేర్లతో బిల్లులు తీసుకుంటున్నారు. చాలామంది అధికారులు తమకు కేటాయించిన చోట కాకుండా జిల్లా కేంద్రంతోపాటు ఇతర జిల్లాల నుంచి సైతం వస్తూ వెళ్తున్నారు. వాస్తవానికి కార్యాలయం నుంచి క్షేత్రస్థాయి పర్యటనలకు మాత్రమే వాహనం వినియోగించాలి. అయితే తమ ఇంటి నుంచి సైతం అద్దె వాహనాలనే ఉపయోగిస్తున్నారు. చాలాసార్లు వ్యక్తిగత పనులకు సైతం అద్దె వాహనాలను ఉపయోగిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో వాహన యజమానులు కొందరు డీజిల్, డ్రైవర్, వాహన నిర్వహణ, మరమ్మతులు, ఇతర ఖర్చులు భరించలేకపోతున్నామని అంటున్నారు.

బిల్లుల చెల్లింపుల్లో..

టెండర్లలో ఎంపిక చేసిన వాహనానికి ప్రతీ నెలకు రూ.36వేలు చెల్లింపుతో 2500కి.మీ తిరగాలి. క్యాంపర్, కార్లు సమకూర్చుకోవచ్చు. నెలవారీగా వాహనం తిరిగిన ప్రకారం రికార్డులు నమోదు చేసి బిల్లులు మంజూరు చేయాలి. ఎవరైనా వాహనదారుడు తమకు అనుకూలంగా లేకపోతే మళ్లీ వాహనానికి అనుమతి ఇవ్వరని చాలామంది బయటకు చెప్పుకోలేకపోతున్నారు. ఇక అధికారులు తమకు కేటాయించిన కేంద్రాల్లో ఉండాలనే నిబంధన ఉన్నా వివిధ ప్రాంతాల నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో డ్రైవర్లకు ఇబ్బందితోపాటు డీజిల్ ఖర్చులు పెరుగుతున్నాయి. వాహనదారులు, అధికారులు సత్సంబంధాలతో బిల్లుల చెల్లింపులు జరుగుతున్నాయి. ఇటీవల జిల్లా ఉన్నతాధికారికి కేటాయించిన వాహన అద్దె విషయంలో యజమాని మధ్య వివాదం నెలకొంది. జిల్లాలో కాకుండా కరీంనగర్ దాక వాహనం నడపాలంటూ ఒత్తిడి తెచ్చినట్లు సమాచారం. దీనిపై జిల్లా ఎస్ఈ వి.గంగాధర్‌ను వివరణ కోరగా, అద్దె వాహనాల్లో ఎలాంటి అవకతవకలు జరగడం లేదని, ఓ వాహనదారుడు ఆరోపిస్తున్నట్లుగా ఏం జరగడం లేదన్నారు.

న్యూస్‌రీల్

గీత కార్మికుల సంక్షేమానికి కృషి



కిట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే వివేక్

చెన్నూర్: గీత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్‌వెంకటస్వామి అన్నారు. గురువారం స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో 70మంది గీత కార్మికులకు కాటమయ్య కిట్లను అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత పదేళ్లు గీత కార్మికులను బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ధ్యేయం

చెన్నూర్‌రూరల్/జైపూర్: పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే గడ్డం వివేక్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ జై బాపు, జై భీం, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం చెన్నూర్ మండలం ఒత్కులపల్లి, జైపూర్ మండలం కుందారం గ్రామాల్లో రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర నిర్వహించారు. కుందారంలో రూ.20లక్షలతో నిర్మించిన మహిళా భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ మూల రాజిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ బెల్లంకొండ కరుణసాగర్‌రావు, జైపూర్ ఎంపీడీవో సత్యనారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ విద్యాసాగర్‌రావు పాల్గొన్నారు.

పని చేయని వ్యవసాయ అధికారుల ఫోన్ నంబర్లు

మంచిర్యాలఅగ్రికల్చర్: రైతులకు సూచనలు, సలహాలు ఇస్తూ, సందేహాలు నివృత్తి చేయాల్సిన వ్యవసాయ శాఖ అధికారుల ఫోన్ నంబర్లు పని చేయడం లేదు. కొద్ది రోజులుగా రైతులు డీఏవో, ఏడీఏ, ఏవో, ఏఈవోలకు వివిధ సమస్యలపై ఫోన్ చేస్తుండగా పని చేయడం లేదని వాపోతున్నారు. ప్రస్తుతం యాసంగి వరి, మొక్కజొన్న తదితర పంటల దిగుబడి వస్తుండగా, వరిలో తెగుళ్లు ఆశిస్తున్నాయి. మరోవైపు మబ్బులు పడుతూ అకాల వర్షాలు కురుస్తున్నాయి. వరి నేలబారి, పంటలకు నష్టం వాటిల్లుతోంది. పంట నష్టం గుర్తించాలని ఆయా గ్రామాల రైతులు ఫోన్ చేస్తుండగా పని చేయడం లేదని వాపోతున్నారు. వ్యవసాయ శాఖకు గతంలో కేటాయించిన నంబర్లు కొద్ది రోజుల క్రితం మారినట్లు తెలుస్తోంది. ఈ విషయమై జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కల్పనకు ఫోన్ చేయగా.. నంబరు పని చేయలేదు.


తాగునీటి సరఫరాలో విఫలం



గావ్ చలో కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు

చెన్నూర్: చెన్నూర్ పట్టణ ప్రజలకు తాగునీటి సరఫరాలో గత, ప్రస్తుత ప్రభుత్వాలు విఫలమయ్యాయని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్ అన్నారు. పట్టణంలోని చోట హనుమాన్ మందిర్‌లో గురువారం ప్రత్యేక పూజలు చేసి గావ్‌చలో బస్తీ చలో కార్యక్రమాన్ని ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెన్నూర్‌లో 12 ట్యాంక్‌లున్నా ఒక్క ట్యాంక్ నుంచి బిందెడు నీళ్లు రావడం లేదని ఆరోపించారు. గోదావరి నది నుంచి రోజు వందలాది లారీల ఇసుక తరలిపోతోందని, స్థానిక అవసరాలకు ఇవ్వడం లేదని తెలిపారు. స్థానికులకు గోదావరి ఇసుక ఇచ్చే విధంగా ఎమ్మెల్యే చొరవ చూపాలని తెలిపారు. మున్సిపల్ కార్యాలయానికి కాంపౌండ్ వాల్ నిర్మించుకోలేదని దుస్థితి నెలకొందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు జాడి తిరుపతి, బత్తుల సమ్మయ్య, గర్రెపల్లి నర్సయ్య, రాపర్తి వెంకటేశ్వర్, కేపీఎం శ్రీనివాస్, కమ్మల శ్రీనివాస్, తుమ్మ శ్రీపాల్, స్వరూపారాణి, ఏతం శివకృష్ణ పాల్గొన్నారు.

సాధారణ ప్రసవాలపై అవగాహన కల్పించాలి



వైద్యసిబ్బందితో మాట్లాడుతున్న హరీశ్‌రాజ్

దండేపల్లి: సాధారణ ప్రసవాలపై ప్రజలకు అవగాహన కల్పించి, శస్త్రచికిత్సలు తగ్గించాలని జిల్లా వైద్యాధికారి హరీశ్‌రాజ్ సూచించారు. మండలంలోని తాళ్లపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులకు వైద్యసేవలపై ఆరా తీశారు. అనంతరం వైద్య సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. వేసవిలో వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి అప్పాల ప్రసాద్, పీహెచ్‌సీ డాక్టర్ క్రాంతికుమార్ జిల్లా మాస్‌మీడియా అధికారి వెంకటేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు

- సన్నబియ్యం సరఫరాపై పటిష్ట నిఘా
- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



జిల్లా కేంద్రంలోని మహాప్రస్థానం పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో వరి ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి బ్రహ్మారావు, జిల్లా మేనేజర్ శ్రీకళ, అధికారులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో 3,41,795 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చే అవకాశం ఉందని, స్థానిక అవసరాలు, విత్తనాలు, రైస్‌మిల్లర్ల కొనుగోలు పోను పౌర సరఫరాల సంస్థ ద్వారా 3,31,395 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసే అవకాశం ఉంటుందని, 321 వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 2,19,106 రేషన్ కార్డులు ఉన్నాయని, 4,143 మెట్రిక్ టన్నుల ధాన్యం పంపిణీకి కేటాయించగా.. ఇప్పటివరకు 82.05 శాతంతో 3,400 మెట్రిక్ టన్నులు పంపిణీ చేశామని తెలిపారు. సన్నబియ్యం పక్కదారి పట్టకుండా పటిష్ట నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

పోషణ పక్షం పకడ్బందీగా నిర్వహించాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లా మహిళ, శిశు, వయోవృద్ధులు, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 22 వరకు పోషణ పక్షం కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో ఇన్‌చార్జి జిల్లా సంక్షేమ శాఖ అధికారి నీరటి రాజేశ్వరి, జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి పురుషోత్తంనాయక్, ఎస్సీ, ఎస్టీ కులాల అభివృద్ధి అధికారి రవీందర్‌రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. సీడీపీవోలు విజయలక్ష్మి, రేష్మ, మనోరమ, జిల్లా సమన్వయకర్త రజిత, ప్రాజెక్టు సహాయకురాలు శ్యామల పాల్గొన్నారు.

గీత కార్మికుల సంక్షేమం దిశగా చర్యలు

మంచిర్యాలఅగ్రికల్చర్: గీత కార్మికుల సంక్షేమం దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. కలెక్టర్ చాంబర్‌లో వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి ఏ.పురుషోత్తం నాయక్‌తో కలిసి గీత కార్మికులకు కాటమయ్య రక్షణ కిట్లు పంపిణీ చేశారు.

తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలి

నస్పూర్/మంచిర్యాలటౌన్: వేసవిలో తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులకు ఆదేశించారు. గురువారం మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని చున్నంబట్టివాడ, నస్పూర్‌లోని 23వ వార్డు, శ్రీరాంపూర్, ఆర్‌కే-6, శ్రీరాంపూర్ బస్టాండ్, సీతారాంపల్లి ప్రాంతాల్లో అమృత్2.0 పనులు పరిశీలించారు. కాలేజీరోడ్డులో మహాప్రస్థానం సందర్శించి సౌకర్యాలు, పనులను పరిశీలించి మిగతా పనులు తక్షణమే పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ శివాజీ పాల్గొన్నారు.

సాగు'బడి'లో..



తోటలో పని చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

చెన్నూర్‌రూరల్: మండలంలోని కాచన్‌పల్లి గ్రామంలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పాఠాలతోపాటు సాగు పాఠాలూ చెబుతున్నారు. బడిలో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు 18మంది విద్యార్థులు ఉన్నారు. పాఠశాల ఆవరణలో సోరకాయ, వంకాయ, కాకర, పుదీన, కొత్తిమీర తదితర కూరగాయలు, ఆకుకూరలు సాగు చేస్తున్నారు. ప్రతీ రోజు విరామ సమయంలో ప్రధానోపాధ్యాయుడు తోకల శ్రీధర్, మరో టీచర్ కలిసి విద్యార్థులతో ఎంతో ఆసక్తిగా తోటలో పనులు చేస్తుంటారు. దీంతో విద్యార్థులకు పంటలు, ఉద్యానవపంటలపై అవగాహన కలుగుతోంది. పండిన కూరగాయల ను మధ్యాహ్న భోజనంలో వంటకు ఉపయోగి స్తుంటారు. వేసవి సెలవుల్లో మధ్యాహ్న భోజ న నిర్వాహకులు తోట నిర్వహణ చూసుకుంటారు.

భయపెట్టినా వెనక్కి తగ్గలే..!

- పార్థి దొంగలను పట్టుకోవడానికి వెళ్లిన బెల్లంపల్లి పోలీసులు
- ప్రతిఘటించిన కుటుంబ సభ్యులు
- నాటు తుపాకులు పట్టుకుని.. రాళ్లు, కర్రలతో దాడి
- ధైర్యంగా ఎదుర్కొని ఊరి పొలిమేరల దాకా ఉరికించిన మన పోలీసులు
- ప్రాణాలకు తెగించి నిందితుడిని అరెస్టు చేసిన ఖాకీలు

బెల్లంపల్లి: ఇళ్లలో చోరీకి పాల్పడిన అంతర్రాష్ట్ర దొంగలను పట్టుకోవడానికి బెల్లంపల్లి పోలీసులు ప్రాణాలు పణంగా పెట్టి పోరాడాల్సి వచ్చింది. ఎన్నో సవాళ్లు, మరెన్నో ఆటుపోట్లు ఎదుర్కొని మధ్యప్రదేశ్ రాష్ట్రం నుంచి నిందితుడిని తీసుకురావడానికి ఎంతో ధైర్య సాహసాలు ప్రదర్శించాల్సి వచ్చింది. ఇటీవల బెల్లంపల్లి కాల్‌టెక్స్ ఏరియాలోని రెండిళ్లలో చోరీ జరిగింది. అంతర్రాష్ట్ర దొంగల ముఠాగా గుర్తించిన పోలీసులు ఒకరిని పోలీసులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. పరారీలో ఉన్న నిందితుల్లో ఒకరిని అరెస్టు చేయడానికి ప్రాణాలకు తెగించాల్సి వచ్చినట్లు తెలుస్తోంది.

ప్రాణాలు తీసేందుకూ వెనుకాడరు..

మధ్యప్రదేశ్ రాష్ట్రం గుణా జిల్లా కనేరా గ్రామంలోని పార్థి కులానికి చెందిన వ్యక్తుల వృత్తి, ప్రవృత్తి ఇళ్లలో దొంగతనాలు చేయడమే. చోరీ చేయడంలో అరవీర భయంకరులు. వీరు చూడడానికి అమాయకంగా కనిపించినా చోరకళలో వీరిని మించిన వారు లేరు. చోరీ చేస్తుండగా ఎవరైనా పట్టుకోవడానికి ప్రయత్నిస్తే ప్రాణాలు తీయడానికీ వెనుకాడరు. దొంగతనం చేసే క్రమంలో మహిళలపై లైంగికదాడులకు తెగబడుతారు. స్వరాష్ట్రంలో దొంగతనాలకు పాల్పడకపోవడం వీరి ప్రత్యేకత కాగా.. అక్కడి పోలీసుల రికార్డుల్లో వీరిపై ఎలాంటి కేసులు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటారు. మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో దొంగతనాలు చేస్తూ పట్టుబడకుండా తప్పించుకుంటారు.

దోచుకెళ్లిన సొమ్ముతో జల్సాలు

పార్థి దొంగలు చోరీ చేసి తీసుకెళ్లిన సొమ్ముతో జల్సాలు చేసుకుంటారు. మద్యం తాగడం, నచ్చిన భోజనం తినడానికి ఖర్చు చేస్తారు. దొంగతనాలు తప్ప వీరికి మరో పని ఉండదు. ఎన్ని లక్షలైనా సరే కుటుంబ సభ్యుల చేతుల్లోకి వెళ్లగానే రోజుల వ్యవధిలో నయాపైసా మిగలకుండా విలాసాలకు ఖర్చు చేస్తారు. పూరిళ్లలో నివాసం ఉండడానికి ఇష్టపడే దొంగలు దోచుకెళ్లిన సొమ్మును పూర్తిగా ఖర్చు చేశాక గానీ మళ్లీ దొంగతనాలకు వెళ్లరు.

తుపాకులు పట్టుకుని.. రాళ్లతో దాడి

ఇతర రాష్ట్రాల్లో చోరీ చేసి ఇళ్లకు వెళ్లిన పార్థి దొంగలను పట్టుకోవాలంటే పోలీసులు దేనికైనా తెగించాల్సిందే అంటే నమ్మి తీరాల్సిన వాస్తవం. దొంగలను వెతుక్కుంటూ కనేరా గ్రామానికి వెళ్లిన రాష్ట్రేతర పోలీసులకు స్థానికుల నుంచి ఎలాంటి సహకారాలు అందవు. చోరీ చేసిన వ్యక్తులు ఎదురుగా కనిపించినా అంత సునాయాసంగా అరెస్టు చేయడం కుదరదు. ఇటీవల రెండిళ్లలో జరిగిన చోరీ కేసులో నిందితులను గుర్తించిన బెల్లంపల్లి పోలీసులు కనేరా గ్రామానికి వెళ్లగా పార్థి దొంగల కుటుంబ సభ్యులు తీవ్రమైన ప్రతికూల పరిస్థితులు కల్పించినట్లు సమాచారం. పక్కా వ్యూహంతో వెళ్లిన పోలీసులు నిందితుల ఇళ్లను చుట్టుముట్టగానే ఒక్కసారిగా కుటుంబసభ్యులు నాటు తుపాకులతో ప్రతిఘటించినట్లు తెలుస్తోంది. కాల్పులు జరపడానికి తెగబడడంతోపాటు రాళ్లు, కర్రలను పోలీసులపైకి విసిరి తమవారిని అరెస్టు చేయకుండా ఆటంకాలు కల్పించారు. అక్కడి పోలీసులు ఏమాత్రం సహకరించకపోవడంతో మన పోలీసులు ఒకింత ధైర్యాన్ని కూడగట్టుకుని ఎదురుదాడి చేయాల్సి వచ్చినట్లు తెలుస్తోంది. మూకుమ్మడిగా నిందితుల కుటుంబ సభ్యులను ఎదుర్కొని గ్రామ పొలిమేర వరకు ఉరికించి తెలంగాణ పోలీసుల పౌరుషం, పనితీరు ప్రదర్శించి ముచ్చెమటలు పట్టించారు. దొంగల కుటుంబ సభ్యులు వెనక్కి తగ్గడంతో నలుగురు నిందితుల్లో ఒకరైన గజానంద్‌పార్థిని అరెస్టు చేసి బెల్లంపల్లికి తీసుకొచ్చారు. అంతటి ధైర్యసాహసాలు ప్రదర్శించిన బెల్లంపల్లి పోలీసులను అభినందించాల్సిందే.

క్లుప్తంగా

గంజాయి విక్రేతపై కేసు

నేరడిగొండ: మండలంలోని దేవులతండా గ్రామంలో గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ జుల్ఫేఖార్ అహ్మద్ తెలిపారు. గ్రామంలో ఓ వ్యక్తి గంజాయి విక్రయిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దేవులతండాలో తనిఖీలు చేపట్టినట్లు పేర్కొన్నారు. జాట్వే మాన్‌సింగ్ అనే వ్యక్తి ఇంటి వద్ద సుమారు 325 గ్రాముల గంజాయి లభించినట్లు తెలిపారు. అతడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. గంజాయి అమ్మినా, రవాణా చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బోథ్‌లో మరొకరిపై..

బోథ్: మండల కేంద్రంలో గంజాయి విక్రయించడానికి వచ్చిన మట్ట అందు అనే వ్యక్తిని ఎస్సై ప్రవీణ్‌కుమార్ పట్టుకున్నారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని డేరా గ్రామానికి చెందిన మట్ట అందు మండల కేంద్రానికి గురువారం గంజాయి విక్రయించేందుకు వచ్చాడు. మార్కెట్ సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతున్నాడు. అతడి వద్దకు వెళ్లి పరిశీలించగా రూ.3 వేల విలువైన 125 గ్రాముల గంజాయి లభ్యమైనట్లు ఎస్సై తెలిపారు. అతడిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

ఏసీసీ క్వారీలో కారు బోల్తా

మంచిర్యాలక్రైం: మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఏసీసీ క్వారీ లోయలో కారు బోల్తా పడింది. అందులో ప్రయాణిస్తున్న వారు బెంగళూర్‌కు చెందిన వారిగా తెలుస్తోంది. ఎదురుగా వస్తున్న మోటార్‌సైకిల్‌ను తప్పించబోయి లోయలోకి దూసుకెళ్లింది. మోటార్‌సైకిల్‌పై ప్రయాణిస్తున్న వ్యక్తికి, కారులో ప్రయాణిస్తున్న ఐదుగురికి స్వల్ప గాయాలైనట్లు సమాచారం. సీఐ ప్రమోద్‌రావు సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కారు లోయలోకి దూసుకెళ్లి చెట్ల పొదల్లో ఆగిపోయినట్లుగా ఉంది. కారులో ఎవరూ లేకపోవడంతో వారి ఆచూకీ కోసం స్థానిక ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో వివరాలు అడిగి తెలుసుకుంటున్నారు.

అప్పుల బాధతో ఒకరి ఆత్మహత్య


రాజయ్య (ఫైల్)

బెల్లంపల్లిరూరల్: అప్పుల బాధతో ఒకరు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బెల్లంపల్లి మండలంలో చోటు చేసుకుంది. తాళ్లగురిజాల ఎస్సై సీహెచ్ రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. పాత బెల్లంపల్లి గ్రామానికి చెందిన నలిమెల రాజయ్య (57) వ్యవసాయం చేయడంతోపాటు వెల్డింగ్ షాపు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. షాపు సక్రమంగా నడవకపోవడంతో మనస్తాపానికి గురయ్యాడు. ఈక్రమంలో మద్యానికి బానిసయ్యాడు. తన కూతురు, కుమారుడి వివాహాలకు చేసిన అప్పులు తీర్చలేక నిత్యం మనోవేదనకు గురయ్యేవాడు. ఈ క్రమంలో రాజయ్య ఈ నెల 3న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు రాజయ్యను మంచిర్యాల ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. రాజయ్య కుమారుడు వంశీకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జేసీబీ ధ్వంసం చేసి దాడికి పాల్పడ్డవారిపై కేసు

మంచిర్యాలక్రైం: కోర్టు ఉత్తర్వులు దిక్కరించి అక్రమంగా ఓ వ్యక్తి భూమిలోకి చొరబడి జేసీబీని ధ్వంసం చేసిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వినిత గురువారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని హమాలీవాడకు చెందిన తూటి శ్రీనివాస్ 301 సర్వే నంబర్‌లో 10 గుంటల భూమిని 2018లో గాండ్ల చంద్రమౌళి వద్ద కొనుగోలు చేశాడు. ఈ భూమిని కొద్దిరోజుల క్రితం గద్దరాగడికి చెందిన బొంకూరి సరోజ, ఆమె కుటుంబ సభ్యులు కబ్జా చేసే ప్రయత్నం చేయగా శ్రీనివాస్ కోర్టును ఆశ్రయించాడు. కోర్టు శ్రీనివాస్‌కు అనుకూలంగా ఇంజక్షన్ ఆర్డర్ ఇచ్చింది. దీంతో ఈ నెల 9న శ్రీనివాస్ జేసీబీతో సదరు భూమిని చదును చేస్తున్నాడు. ఈక్రమంలో బొంకూరి శ్రీనివాస్, దేవిరెడ్డి మహేందర్‌రెడ్డితో పాటు మరి కొందరు జేసీబీపై రాళ్లతో దాడి చేసి ధ్వంసం చేశారు. ఈ దాడిలో సుమారు రూ.25వేల నష్టం జరిగింది. ఈ మేరకు తూటి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు మహేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌తోపాటు మరి కొందరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మట్కా నిర్వాహకుడి షెడ్ కూల్చివేతకు ఆదేశం

ఆదిలాబాద్‌టౌన్: మట్కా నిర్వాహకుడి షెడ్ కూల్చివేతకు ఆదిలాబాద్ ఆర్డీవో వినోద్‌కుమార్ ఆదేశాలు జారీ చేశారు. జిల్లా కేంద్రంలోని ఇందిరానగర్‌కు చెందిన షేక్ రంజాని నివాసంలో మట్కా నిర్వహిస్తూ ఎనిమిది మంది పట్టుబడ్డారు. దీంతో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని టూటౌన్ పోలీసులు ఆర్డీవోకు లేఖ రాశారు. ఆర్డీవో స్పందిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. 48 గంటల్లో షెడ్ తొలగించాలని, లేని పక్షంలో జప్తు చేస్తామని తెలిపారు. ఎవరైనా మట్కా, జూదం నిర్వాహకులకు ఆశ్రయం కల్పించినా, అసాంఘిక కార్యకలాపాలకు సహకరించినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

'అమెరికా' ఆశలకు కళ్లెం!

- వీసా కోసం నూతన ఆంక్షలు
- స్టడీ కోసం వెళ్లే వారికి నిరాశే..
- ఓపీటీ రద్దుకు ట్రంప్ యత్నం
- ఉమ్మడి జిల్లావాసుల్లో కలవరం


అమెరికాలో భారతీయ విద్యార్థులు (ఫైల్)

నిర్మల్‌ఖిల్లా: భూతల స్వర్గం యూఎస్‌ఏ వెళ్లాలని ప్రతి ఒక్కరూ లక్ష్యంగా పెట్టుకుని చదువుతుంటారు. ఉన్నత చదువుల కోసం వెళ్లి అక్కడే ఉద్యోగాల కోసం ప్రయత్నించి స్థిరపడాలని ఆశ పడతారు. అయితే ప్రస్తుతం అలాంటి వారి మనసుల్లో అలజడి మొదలైంది. దీనికంతటికీ కారణం అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఇతర దేశాల నుంచి ఉన్నత చదువులు, ఉద్యోగాల కోసం వచ్చే వారికి అమెరికా ప్రవేశం విషయంలో పలు నిబంధనలు విధించనుండటమే. ఇదే అంశంపై పలు జాతీయ, అంతర్జాతీయ మీడియాలోనూ వార్తలు వస్తుండడంతో ఉమ్మడి జిల్లావాసుల్లోనూ కలవరం మొదలైంది. బీఈ, బీటెక్ లాంటి చదువులు చదివి పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో ఎమ్మెస్ లాంటి ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లేందుకు చాలామంది విద్యార్థులు, యువత ఆసక్తి కనబర్చుతుంటారు. కాగా, అక్కడికి వెళ్లినవారు తమ చదువులు పూర్తయిన తర్వాత మూడేళ్లపాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను వెతుక్కునేందుకు ఇదివరకు అవకాశం ఉండేది. అలాంటి అవకాశాన్ని ఓపీటీ (ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్)గా పేర్కొంటారు. ఈ ఓపీటీ అనుమతిని రద్దు చేసేందుకు ట్రంప్ సర్కారు బిల్లు ప్రవేశపెట్టడానికి సిద్ధమవుతోంది.

ఉమ్మడి జిల్లావాసుల్లోనూ కలవరం

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని నిర్మల్, ఆదిలాబాద్, మంచిర్యాల తదితర ప్రాంతాల నుంచి వందలాది మంది విద్యార్థులు పీజీ చదువుల కోసం అమెరికా వెళ్లి అక్కడే ఉపాధి అవకాశాలు వెతుక్కునే పనిలో ఉన్నారు. అలాంటి వారందరిలోనూ ప్రస్తుత పరిస్థితితో కలవరం మొదలైంది. ప్రస్తుతం ఉన్న ఓపీటీ రద్దు అంశాన్ని అమెరికా కాంగ్రెస్ సభలో ప్రవేశపెట్టి బిల్లును ఆమోదింప చేసే ప్రయత్నంలో అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఉన్నట్లు తెలుస్తోంది. ఈ వార్తలతో ఉమ్మడి జిల్లా వాసుల్లోనూ కలవరం మొదలైంది. ఇప్పటికే అక్కడ విద్యనభ్యసిస్తున్న పలువురు విద్యార్థులతో పాటు ఇక్కడి వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. సైన్స్ అండ్ టెక్నాలజీ, ఇంజినీరింగ్, మ్యాథ్స్ తదితర సబ్జెక్టులను స్టెమ్‌గా పిలుస్తారు. ఈ రంగాల్లోని విద్యార్థులు పీజీ అనంతరం ఓపీటీ పేరిట మూడేళ్లపాటు అక్కడే ఉండి ఈ వ్యవధిలోనే ఉపాధి అవకాశాలను వెతుక్కుని అక్కడే స్థిరపడేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఈ బిల్లు ఆమోదమైతే ఇలాంటివారు భారతదేశానికి తిరిగి రావాల్సి ఉంటుంది. ఇక వీసా నిబంధనలు కూడా కఠినతరం చేయడంతో అమెరికా ఆశలు నెరవేరేలా లేవని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ప్రపంచదేశాల నుంచి భారీగా అమెరికాకు వలసలు పెరగడమే కారణమని విశ్లేషకులు భావిస్తున్నారు.

వలసలు పెరిగినందునే..



వివిధ రకాల సాఫ్ట్‌వేర్ కంపెనీలు ఇతర ఎంఎన్సీ సంస్థల్లో ప్రపంచ దేశాల నుంచి లక్షలాదిమంది యువత అమెరికా దేశం వైపు వలస వస్తుండటంతోనే అక్కడి ప్రభుత్వం ఆంక్షలు విధించేందుకు సిద్ధమవుతోంది. ప్రస్తుతమున్న వీసా, ఓపీటీ నిబంధనలు సంస్కరించేందుకు సమాయత్తమవుతోంది. రానున్న రోజుల్లో అమెరికా దేశానికి వచ్చే వారికి కఠిన నిబంధనలు అమలులోకి వస్తాయి.
– బీ మల్లేశ్, సాఫ్ట్‌వేర్ ఉద్యోగి, సిలికాన్ వ్యాలీ, యూఎస్‌ఏ

హెచ్ వన్ బీ, గ్రీన్ కార్డులున్నా..

హెచ్ వన్ బీ, గ్రీన్ కార్డుల వ్యవస్థను కూడా ప్రక్షాళన చేసి మరింత కఠినతరం చేసే పనిలో ట్రంప్ ఉన్నట్లు చెబుతున్నారు. విదేశాల నుంచి తమ దేశానికి వచ్చే వారిపై పలు రకాల ఆంక్షలు విధించనున్నట్లు తెలుస్తోంది. అన్ని రకాల వడపోత తర్వాతే అమెరికా ప్రవేశం చేసేలా నిబంధనలు అమలులోకి తెచ్చేలా ట్రంప్ సర్కారు కఠినంగా ఈ సంస్కరణలు చేపడుతున్నట్లు పలువురు ఎన్నారైలు అభిప్రాయపడుతున్నారు.

నిరాశపర్చిన మామిడి


రాలిపోయిన మామిడి కాయలు


లంబడిపల్లి సమీపంలో కాత లేని మామిడి చెట్టు

- ఈసారి పూత, కాత తక్కువే
- తెగుళ్లతో రాలుతున్న కాయలు
- ఆందోళనలో కౌలు రైతులు

చెన్నూర్‌రూరల్: వాతావరణ మార్పులతో మామిడి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈసారి పూత, కాత సరిగా రాలేదు. కొద్దిపాటిగా కాసిన చోట తెగుళ్ల ఆశించగా కాయలు నల్లగా మారి రాలి పోతున్నాయి. మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా సుమారు 18వేల ఎకరాల్లో మామిడి సాగవుతోంది. చెన్నూర్, కోటపల్లి, భీమారం, నెన్నెల, బెల్లంపల్లి మండలాల్లో ఎక్కువ విస్తీర్ణంలో తోటలున్నాయి. కొందరు రైతులు మామిడి తోటలను కౌలుకు తీసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 8వేల మంది కౌలు రైతులున్నట్లు అంచనా. వీరు ఎకరాకు రూ.లక్ష నుంచి రూ.1.50లక్షల వరకు కౌలు చెల్లిస్తారు. రెండు లేదా మూడేళ్లపాటు తోటల యజమానులకు ముందుగానే కౌలు డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. కౌలు రైతులు జూలై, ఆగస్టు నుంచే ముందస్తు యాజమాన్య పద్ధతులు పాటిస్తారు. మందులు స్ప్రే చేస్తారు. ఇందుకు రూ.వేలల్లో పెట్టుబడి పెడతారు. ప్రకృతి కరుణిస్తే ఎకరం మామిడి తోటలో సుమారు మూడు టన్నుల దిగుబడి వస్తుంది. ఈసారి ఐదు క్వింటాళ్ల దిగుబడి కూడా రాని పరిస్థితుల్లో రైతులు ఆందోళన చెందుతున్నారు. దీనికి తోడు గాలిదుమారాలు, అకాల వర్షాలకు ఎక్కడో ఓ దగ్గర కాసిన కాయలు కూడా రాలి పోతున్నాయని, కనీసం పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని మామిడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కాయలు రాలి పోతున్నయ్



మామిడి చెట్లకు ఈసారి పూత ఆలస్యంగా వచ్చింది. వచ్చిన పూత నిలువక కాత సరిగా రాలేదు. గతేడాది కాయలోపల పురుగు ఆశించి నష్టపోయినం. ఈసారి ఎక్కడో ఒక చెట్టుకు కాయలు కాసినయ్. కానీ.. వాతావరణ మార్పులతో పురుగు ఆశించి అవి కూడా రాలి పోతున్నయ్.
– అట్టెం రాజబాపు, రైతు, చెన్నూర్

తీవ్రంగా నష్టపోతున్నం



ఈసారి మామిడి కాత సరిగా లేదు. తోటలు కౌలుకు తీసుకుని అన్ని రకాల మందులు స్ప్రే చేసినం. అయినా పూత తక్కువగా వచ్చింది. వచ్చిన పూత కూడా రాలిపోయింది. ఎక్కడో ఓ దగ్గర కాత కాసినా గాలి దుమారాలు, అకాల వర్షాలకు అవి కూడా నేల రాలినయ్. ఈసారి దిగుబడి తగ్గి తీవ్రంగా నష్ట పోతున్నం.
– మడె అర్జయ్య, కౌలు రైతు, సంకారం

పంతులమ్మ.. ఇదేమిటమ్మ!

- నిబంధనలకు విరుద్ధంగా స్పాట్ విధులు
- మంచిర్యాలకు బదులు.. ఆదిలాబాద్‌లో డ్యూటీ

ఆదిలాబాద్‌టౌన్/మంచిర్యాలఅర్బన్: పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని సెయింట్ జోసెఫ్ కాన్వెంట్‌లో కొనసాగుతోంది. నిబంధనలకు విరుద్ధంగా ఓ ఉపాధ్యాయురాలు తనకు కేటాయించిన జిల్లాలో కాకుండా ఆదిలాబాద్‌లో విధులకు హాజరవుతున్నారు. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ ఈజ్‌గాం పాఠశాలలో గణితం బోధిస్తున్న ఓ టీచర్‌కు మంచిర్యాలలో స్పాట్ డ్యూటీ కేటాయించారు. పాఠశాల నుంచి రిలీవ్ అయిన ఉపాధ్యాయురాలు మంచిర్యాల ఎస్సెస్సీ స్పాట్ కేంద్రంలో రిపోర్టు చేయాల్సి ఉండగా, ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న స్పాట్ కేంద్రంలో విధుల్లో చేరారు. అధికారులను బురిడీ కొట్టించి స్పాట్‌కు హాజరు కావడంపై పలువురు ఉపాధ్యాయులు హైరానా చెందారు. అనధికారికంగా విధులు నిర్వహిస్తున్నా విద్యాశాఖ అధికారులు పట్టించుకోకపోవడం చర్చనీయాంశంగా మారింది. గత రెండేళ్లుగా సదరు టీచర్ నిబంధనలకు విరుద్ధంగా ఇక్కడే విధులు నిర్వహిస్తున్నట్లు పలువురు ఉపాధ్యాయులు తెలిపారు. ఈ విషయమై ఆదిలాబాద్ డీఈవో శ్రీనివాస్‌రెడ్డిని వివరణ కోరగా.. ఆమె స్పాట్ డ్యూటీలకు హాజరు కాకుండా చూస్తామని తెలిపారు. సదరు టీచర్‌తోపాటు మరో ముగ్గురు ఉపాధ్యాయులు అనుభవం లేకపోయినప్పటికీ పదో తరగతి మూల్యాంకనం విధులకు హాజరవుతున్నట్లు సమాచారం. పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనం చేయాలంటే కనీసం మూడేళ్లపాటు పదో తరగతి విద్యార్థులకు బోధించాల్సి ఉంటుంది. తెలుగు, హిందీ, ఇంగ్లిష్ సబ్జెక్టుల్లో ముగ్గురు ఉపాధ్యాయులు నిబంధనలకు విరుద్ధంగా స్పాట్‌కు హాజరవుతున్నట్లు చెబుతున్నారు. కాగా, మంచిర్యాలలో విధులకు హాజరు కావాల్సిన ఉపాధ్యాయురాలు ఆదిలాబాద్‌లో హాజరు కావడంపై మంచిర్యాల డీఈవో యాదయ్యను సంప్రదించగా.. విచారణ చేపట్టి చర్యలు (నోటీసులు జారీ) తీసుకుంటామని తెలిపారు.

ఎన్‌ఆర్‌ఐ అడ్వైజరీ కమిటీలో స్వదేశ్‌కు స్థానం


స్వదేశ్ పర్కిపండ్ల

నిర్మల్‌ఖిల్లా: గల్ఫ్ కార్మికుల సంక్షేమం, సమగ్ర ఎన్‌ఆర్‌ఐ పాలసీపై అధ్యయనానికి గురువారం ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి ఎన్‌ఆర్‌ఐ అడ్వైజరీ కమిటీలో నిర్మల్ జిల్లా వాసికి చోటు దక్కింది. సారంగపూర్ మండలం తాండ్ర గ్రామానికి చెందిన స్వదేశ్ పరికిపండ్ల ప్రవాసీమిత్ర కార్మిక సంఘం, గల్ఫ్ జేఏసీ పక్షాన దశాబ్దకాలంపైగా పోరాటం చేస్తున్నారు. ప్రస్తుతం ప్రవాసీమిత్ర కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. గల్ఫ్ దేశాలకు వలస వెళ్తున్న కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకురావడంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. తాజాగా ఏర్పాటు చేసిన కమిటీలో సలహా సభ్యుడిగా స్వదేశ్‌కు చోటు దక్కింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు విడుదల చేశారు. ఈ కమిటీ చైర్మన్ రిటైర్డ్ ఐఎఫ్‌ఎస్ అధికారి డాక్టర్ బీఎం వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో సభ్యులు గల్ఫ్ దేశాల్లోని కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, దేశంలోని వివిధ రాష్ట్రాల్లో గల్ఫ్ కార్మికుల సంక్షేమ పథకాలపై అధ్యయనం చేయనున్నారు. కమిటీ నివేదిక ఆధారంగా సమగ్ర ఎన్నారై పాలసీ రూపకల్పన, సంక్షేమ బోర్డు ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోనుంది.

విద్యుదాఘాతంతో రైతు కూలీ మృతి


లింగయ్య (ఫైల్)

చెన్నూర్‌రూరల్: మండలంలోని నాగాపూర్ గ్రామానికి చెందిన కర్ణాల లింగయ్య (42) అనే రైతు కూలీ గురువారం విద్యుదాఘాతంతో మృత్యువాత పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బడికెల లచ్చయ్య పంట పొలం వద్ద బోరుకు అమర్చిన విద్యుత్ మోటర్ కాలిపోయింది. మరమ్మతు అనంతరం బోరులోకి మోటర్ అమర్చేందుకు కర్ణాల లింగయ్యతోపాటు పాంతెపు రంజిత్, దాద స్వామి, అందె రమేశ్ వెళ్లారు. బోరులో విద్యుత్ మోటర్ అమర్చిన అనంతరం కర్ణాల లింగయ్య భుజంపై ఇనుప పైపు పెట్టుకుని ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో పైనున్న 11కేవీ విద్యుత్ తీగలు పైపునకు తాకడంతో విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. లింగయ్యను కాపాడేందుకు ప్రయత్నించగా మిగతావారికీ స్వల్ప గాయాలయ్యాయి. లింగయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనా స్థలాన్ని ఎస్సై వెంకటేశ్వర్‌రావు, కొమ్మెర ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్ పరిశీలించారు. మృతుడికి భార్య పరిమళ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. పరిమళ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పల్లంగూడలో యువకుడు..


కిషన్ (ఫైల్)

కాసిపేట: మండలంలోని దేవాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధి పల్లంగూడకు చెందిన వెడమ కిషన్ (34) విద్యుదాఘాతంతో మృతి చెందాడు. దేవాపూర్ ఎస్సై ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. కిషన్ ఈ నెల 9న ఉదయం 10గంటలకు ఇంటి నుంచి పని నిమిత్తం బయటకు వెళ్లి రాత్రి 9 గంటల సమయంలో వచ్చాడు. స్నానానికి నీళ్లు పట్టుకునేందుకు ఇంట్లోని బావి దగ్గరి మోటర్ వద్దకు వెళ్లాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌తో కిందపడ్డాడు. కుటుంబ సభ్యులు వెంటనే అతడిని మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి భార్య సుమలత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కాగా, అందరితో కలివిడిగా ఉండి ఆదివాసీ ఉద్యమాల్లో క్రియాశీలకంగా వ్యవహరించే కిషన్ మృతిని ఆదివాసీ సంఘాల నాయకులు తట్టుకోలేకపోయారు. ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో నివాళులర్పించారు.

తుమ్మిడిహెట్టి వద్దే 'ప్రాణహిత' నిర్మించాలి


మంత్రికి వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్సీ కోదండరాం, ఎమ్మెల్యే హరీశ్‌బాబు

కాగజ్‌నగర్‌రూరల్/కౌటాల: సిర్పూర్ నియోజకవర్గంలోని తుమ్మిడిహెట్టి వద్దే ప్రాణహిత ప్రాజెక్ట్ నిర్మించాలని ఎమ్మెల్సీ కోదండరాం, ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు, తెలంగాణ జల సాధన సమితి అధ్యక్షుడు నైనాల గోవర్దన్ రాష్ట్ర సాగునీరు, సివిల్ సప్లయ్‌శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డిని కోరారు. గురువారం హైదరాబాద్‌లోని జలసౌధ భవనంలో మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. తుమ్మిడిహెట్టి వద్దనే ప్రాణహిత ప్రాజెక్ట్ నిర్మించాలని, దీంతో ఐదు నియోజకవర్గాలకు సాగునీరు అందుతుందని తెలిపారు. హైదరాబాద్ నగరానికి నీరు సరఫరా చేయడం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. సానుకూలంగా స్పందించిన మంత్రి తుమ్మిడిహెట్టి వద్దనే ప్రాజెక్ట్ పనులు ప్రారంభిస్తామని చెప్పారు. మంచిర్యాల మున్సిపల్ మాజీ చైర్మన్ ప్రతాప్ తదితరులున్నారు.

మట్కా నిర్వాహకులపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ఖుర్షీద్‌నగర్‌కు చెందిన షేక్ నజ్జు అనే మహిళతో పాటు మరో ముగ్గురిపై గురువారం కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు తెలిపారు. ఖుర్షీద్‌నగర్‌లో మట్కా నిర్వహిస్తుండగా నజ్జుతో పాటు ఇదే ప్రాంతానికి చెందిన షేక్ షాహిన్, షేక్ హుస్సేన్, నజిమొద్దీన్‌పై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. వీరి నుంచి రూ.1,940, సెల్‌ఫోన్లు, మట్కా చీటీలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సదరు మహిళ మట్కా నిర్వహిస్తుండగా ఆమె వద్ద షేక్‌హుస్సేన్, షేక్ షాహిన్ డబ్బులు చెల్లించినట్లు వివరించారు. ఆమె మట్కా నిర్వాహకుడు నజిమొద్దీన్‌కు డబ్బులు పంపుతున్నట్లు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మరణం


శాదఫ్ (ఫైల్)


దీపక్ (ఫైల్)

ఇంద్రవెల్లి: రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ఇద్దరు మృతి చెందిన ఘటన గురువారం రాత్రి మండలంలోని దనోరా (బీ) సమీపంలోని పిప్రి గ్రామ చౌక్ వద్ద ప్రధాన రహదారిపై చోటు చేసుకుంది. 108 అంబులెన్స్ పైలట్ అశోక్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన వ్యాపారి చింతవర్ దీపక్ (58) జాలంతండా గ్రామానికి చెందిన తన మునిం నిస్తే అజయ్‌తో కలిసి ఆదిలాబాద్ నుంచి ఇంద్రవెల్లి వైపు ద్విచక్రవాహనంపై వస్తున్నాడు. దనోరా (బీ) గ్రామానికి చెందిన షేక్ శాదఫ్ (19) ముత్నూర్ నుంచి ఇంటికి ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. ఈ క్రమంలో వీరి ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో చింతవర్ దీపక్, షేక్ శాదఫ్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. జాలంతండాకు చెందిన నిస్తే అజయ్‌కు తీవ్రగాయాలయ్యాయి. ఇతడిని స్థానికులు వెంటనే ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న ఎస్సై సాయన్న ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద వివరాలు తెలుసుకున్నారు. మృతదేహాలను ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించినట్లు ఆయన తెలిపారు.

ఫాంహౌస్ స్థలాన్ని పరిశీలించిన తహసీల్దార్

సాక్షి ఎఫెక్ట్..


ప్రభుత్వ భూమిని చదును చేయిస్తున్న తహసీల్దార్

మందమర్రిరూరల్: 'ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం' శీర్షికన గురువారం 'సాక్షి'లో ప్రచురించిన కథనానికి తహసీల్దార్ సతీశ్‌కుమార్ స్పందించారు. గురువారం సర్వేయర్ కృష్ణతో కలిసి 364 సర్వే నంబర్‌లోని భూమి వద్దకు వచ్చారు. ఫాంహౌస్ వద్దకు వెళ్లి సర్వే మ్యాపు, రికార్డులు పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ.. 364 సర్వే నంబర్‌లో ఎకరం 30గుంటల ప్రభుత్వ భూమి ఉందని తెలిపారు. పూర్తి రికార్డుల పరిశీలన అనంతరం హద్దులు గుర్తిస్తామని పేర్కొన్నారు. అలాగే స్థానిక పోలీస్‌స్టేషన్ పక్కన గల పాత కేకే–5 సీఎస్పీ రోడ్డు పక్కనున్న ప్రభుత్వ భూమి వద్దకు ఆర్‌ఐ గణపతితో వెళ్లి పిచ్చి మొక్కలు తొలగింపజేశారు. ప్రభుత్వ భూమిని ఆనుకుని సింగరేణి భూమి ఉందని తెలిపారు. గతంలో సింగరేణి ప్రభుత్వానికి ఎంత భూమి అప్పగించిందో రికార్డులు పరిశీలిస్తామని పేర్కొన్నారు. అనంతరం హద్దులను గుర్తించి స్వాధీనం చేసుకుని కంచె వేస్తామని చెప్పారు. ప్రభుత్వ భూమిలోని నిర్మాణాల విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తే ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

గోదావరిలో మునిగి బాలుడి మృతి


శశికుమార్ మృతదేహం

దండేపల్లి: కళ్లముందే ఉన్నట్టుండి ఒక్కసారిగా విగతజీవిగా మారిన బాలుడిని చూసిన తల్లిదండ్రులు, బంధువులు తీవ్ర విషాదంలో మునిగారు. ఈ ఘటన మండలంలోని కన్నెపల్లిలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ముత్తె భీమయ్య కుమారుడు శశికుమార్‌వర్మ (7) స్థానిక ప్రైవేట్ పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్నాడు. 11 రోజులపాటు ఆంజనేయస్వామికి అతను ఉపవాస దీక్ష చేస్తున్నాడు. ఈక్రమంలో గురువారం పాఠశాలకు వెళ్లి వచ్చిన శశికుమార్‌వర్మ సాయంత్రం గ్రామానికి చెందిన హనుమాన్ దీక్షాస్వాములతో కలిసి గూడెం గోదావరి నదిలో స్నానానికి వెళ్లాడు. నదిలో స్నానం చేసే సమయంలో ప్రమాదవశాత్తు జారి నీటిలో మునిగి చనిపోయాడు. బాలుడి మృతితో కుటుంబీకులు కన్నీరు మున్నీరుగా విలపించారు. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తహసీనొద్దీన్ తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరి మృతి


రాజు (ఫైల్)

భైంసారూరల్: మండలంలోని వానల్‌పాడ్ గ్రామ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని బోయిడోళ్ల రాజు (32) మృతి చెందాడు. ఎస్సై శంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. భైంసా పట్టణంలోని గోపాల్‌నగర్‌కు చెందిన రాజు గురువారం వేకువజామున వానల్‌పాడ్ గ్రామం నుంచి తిమ్మాపూర్ వైపునకు నడుచుకుంటూ వెళ్తున్నాడు. అదే సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో రాజు తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సంస్మరణ సభకు నిధులివ్వాలి

ఉట్నూర్‌రూరల్: ఇంద్రవెల్లి మండలం హర్కాపూర్ గ్రామ సమీపంలోని అమరవీరుల స్థూపం వద్ద సంస్మరణ సభ నిర్వహణకు నిధులు మంజూరు చేయాలని ఇంద్రవెల్లి అమరవీరుల ఆశయ సాధన కమిటీ చైర్మన్ కనక తులసీరాం కోరారు. ఈ మేరకు గురువారం ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తాను పీవో క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంద్రవెల్లి స్థూపం వద్ద ప్రతీ సంవత్సరంలో ఏప్రిల్ 20న సంస్మరణ సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. సభలో అధికసంఖ్యలో ఆదివాసీ ప్రజలు, నాయకులు పాల్గొని నివాళులర్పిస్తున్నట్లు పేర్కొన్నారు. సభ నిర్వహణకు ఐటీడీఏ నుంచి ప్రత్యేక నిధులు కేటాయించాలని పీవోను కోరారు. స్పందించిన పీవో త్వరలోనే కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహిస్తానని పేర్కొన్నట్లు తులసీరాం తెలిపారు. అనంతరం పీవో కమిటీ చైర్మన్ తులసీరాంను సన్మానించారు. తుడుం దెబ్బ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పుర్క బాపురావు, రగల్ జెండా ప్రధాన కార్యదర్శి కొట్నాక్ బారిక్‌రావు, శ్యాంరావు, చిత్రు తదితరులున్నారు.

దౌర్జన్యాలకు అడ్డుకట్ట వేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఆశయ్య

వేమనపల్లి: గ్రామాల్లో పెత్తందారుల దౌర్జన్యాలకు ప్రభుత్వ యంత్రాంగం అడ్డుకట్ట వేయాలని చేతివృత్తిదారుల సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ పైళ్ల ఆశయ్య డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు బాగాల రాజన్న అధ్యక్షతన నిర్వహించిన ఆదివాసీ, దళిత సంఘాల రౌండ్ టేబుల్ సమావేశానికి హాజరై మాట్లాడారు. మండలంలోని మంగెనపల్లి గ్రామంలో పెత్తందారి వేధింపులకు ఆదివాసీ బిడ్డ నాయిని కన్నయ్య మృత్యువాత పడితే స్థానిక ఎమ్మెల్యే, ఏ అధికారి బాధిత కుటుంబాన్ని పరామర్శించకపోవడం దారుణమన్నారు. కన్నయ్య కుటుంబానికి రూ.50లక్షల పరిహారం, అతడి భార్యకు ప్రభుత్వ ఉద్యోగం, ఐదెకరాల భూమి, ఇందిరమ్మ ఇల్లు, పెన్షన్ అందజేయాలన్నారు. కన్నయ్య మృతికి కారకులపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కోరారు. కన్నయ్య కుటుంబానికి తెలియకుండా సీలింగ్ పట్టా భూమిని అక్రమంగా పట్టా చేయించుకున్న వ్యక్తిపై కేసు నమోదు చేసి పట్టాను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ఎర్మ పున్నం, తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు సంకె రవి, బోధి సత్వ సమాజ్ వ్యవస్థాపక అధ్యక్షుడు వలీ హైదర్, వివిధ సంఘాల నాయకులు బాపు, రవి, ఎల్లయ్య, రవి, శంకర్, అశోక్ పాల్గొన్నారు.